**తల్లిగారిల్లు.....**

రాత్తిరి కురిసిన వానకు రాలిన చినుకులు తంగేడు పూలపై నిలిచి తళతళా మెరిసిపోతున్నాయి. ఆ నీటిలో తమ నీడలు చూసుకుంటూ మురిసిపోతున్నాయి పిల్ల మబ్బులు. పైరగాలితో ఆడుకుంటూ పరవశంగా ఊగిపోతున్నాయి కంది చేలు. ఆ కందిచేను సాళ్ల మధ్య.....ఒంటరిగా గడ్డి కోస్తూ పుట్టెడు దుఃఖాన్ని వలపోస్తోంది పూలమ్మ.

**జజ్జనక జజ్జనం..... జజ్జనక జజ్జనం...** అంటూ ఊళ్లో మోగుతున్న డప్పుల చప్పుడు పూలమ్మకు స్పష్టంగా వినపడుతోంది. గడ్డి కోయడానికి తెల్లారగట్ల ఇంటి నుంచి బయలెల్లినప్పడి నుంచి ఆమె కళ్లల్లో నీళ్లు కట్ట తెగిన చెరువులా కారిపోతున్నాయి.

ఆ డప్పుల చప్పుడు ఊరంతా బతకమ్మ పండగ సందడి తెస్తుంటే... పూలమ్మకు మాత్రం చెప్పలేని దుఃఖం వస్తోంది.

రాత్రి కురిసిన రెండు పదున్ల వానకు భూమి నాని పోయి....గడ్డి కోయటం చానా కష్టంగా ఉంది. కొడవలితో గడ్డి కోస్తుంటే...వేర్లతో సహా మట్టి కూడా లేచి పైకి వస్తోంది. అందుకనే రోజుకంటే తక్కువ గడ్డి కోసింది పూలమ్మ. వాళ్ల అత్త ఇయన్నీ పట్టించుకోదు. ఇటు గడ్డి మోపు ఏ మాత్రం తగ్గినా, అటు పొద్దు పోయినా నోరు సంకన పెట్టి అనరాని మాటలంటది.

గడ్డి మందంగా ఉన్న చోటు కోసం కంది చేను సాళ్ల మధ్య దేవులాడింది పూలమ్మ. ఓ చోట వెన్నెముద్దలల్లం గడ్డి ఒత్తుగా కనపడ్డది. **సాలు మొత్తం గడ్డి కోసి... మోపు కట్టడానికి తాటి కమ్మాకుల కోసం... చేను గెట్టు దగ్గర ఉన్న తాటి చెట్టుకాడికి పోయింది.**

చెట్టు పక్కన వరుసగా తంగేడు చెట్లు. ఆ చెట్లకు బంగారు పూలు పూసినట్లు మెరిసిపోతున్న తంగేడు పూలు. తంగేడు పూలు చూడగానే ఏ ఆడబిడ్డకైనా ఒళ్లు పులకరిస్తది. పసిపాపల బుగ్గల్లా మెత్తగా ఉన్న పూల రెమ్మలను సుతారంగా తాకాలని అనిపిస్తది. కానీ పూలమ్మ మాత్రం ఆ పూలను చూసి కళ్లనిండా నీళ్లు తెచ్చుకుంది. ఆ తంగేడు చెట్టు కిందనే కూలబడి .....అశోక వనంలో సీతలా కుమిలిపోతోంది.

***

పొద్దు పోయి ఇంటికి పోతే అత్త తిడ్తదన్న సంగతి యాదికి రాగానే లేచి తాటాకులు కోసింది. గడ్డి మోపు కట్టి ఎత్తుకోవడానికి పైకి లేపితే లేవలేదు. వానకు తడిసిన గడ్డి కావడంతో బరువు ఎక్కువయ్యింది. ఎవలనన్నా పిలుద్దామని అటూ ఇటూ చూసింది. ఎవలూ కనబడలేదు. మళ్లొక్కసారి ఒంట్లోని

ప్రాణమంతా కూడ బట్టి గట్టిగా ఉపకాయించి పైకి లేపింది. ఆ బలానికి గడ్డిమోపు భుజం మీదికి వచ్చింది. కానీ ఒక్కసారిగా పొట్టల పేగులు కదిలినయి.

నెత్తిన గడ్డిమోపు బరువెక్కువై మెడ ఇరిగిపోతదేమో అన్నట్లుంది. పండ్ల మీద బాధను నొక్కి పట్టి గబగబ అడుగులు వేసుకుంటూ నడుస్తోంది. డప్పుల సప్పుడు దగ్గరకు చేరింది. జజ్జనక జజ్జనం...జజ్జనం జజ్జనం.

డప్పులు చేరువవుతున్న కొద్దీ పూలమ్మకు కాళ్లు వణుకుతున్నాయి. నెత్తిన మోపు మరింత బరువయ్యింది. ఎక్కడ పడిపోతానేమో అనిపిస్తోంది. కదలకుండా అట్లే రాయిలా నిలబడ్డది. మెల్లగా డప్పులు దూరంగా పొయ్యాయి.

అయ్యి బతకమ్మ డప్పులు. ఇప్పుడంటే కాలెండర్లు, పంచాగాలు అందరి దగ్గరా ఉంటున్నై కానీ ఎనకట అట్ల కాదు గద. అందుకనే బతకమ్మ పండుగ రెండు మూడు రోజుల ముందే... ఊళ్లే పెద్దలు అందరికీ చెప్పడం కోసం చాటింపు వేయించేవాళ్లు. అదే సాలు ఇప్పటికీ పాటిస్తూ డప్పులు కొడుతున్నరు. ఈ చాటింపు మొదలైన రోజునుంచే బతకమ్మ పండక్కు ఏర్పాట్లు చేసుకుంటరు. పొరుగూర్లే ఉన్న తమ ఆడబిడ్డలను పండగకు పుట్టింటికి తీసుకొచ్చుకుంటరు. కానీ పూలమ్మ కోసం మాత్రం ఎవరూ రారు.

***

గడ్డి మోపు తీస్కపోయి ఇంటి దగ్గర గొడ్ల కొట్టంల ఎత్తేసింది పూలమ్మ. నెత్తి మీద నుంచి కొండంత భారం దింపినట్లనిపించింది.

" తెల్లార గట్ల లేచి గడ్డికోసం పోయిన మనిషివి. గిప్పుడా ఇళ్లు చేరేది. గియ్యాల దాక ఏడ తిరిగితివి....." వంట చేస్తున్న అత్త వెంకటమ్మ తన రాగం మొదలు పెట్టింది. పక్కనే ఉన్న రెండు ఎండు కట్టె పుల్లలు మంటలోకి వేసింది. పొయ్యిలో కన్నా అత్త మొఖంలోనే ఎక్కువ మంట కనపడ్డది పూలమ్మకు.

అత్త వంట చేస్తోంటే ...., పక్కనే యారాలు (తోటి కోడలు) సుభద్ర కూర కోసం దోసకాయలు కోస్తాంది. చిన్న కోడలు సుభద్ర వెంకటమ్మకు తమ్ముని బిడ్డ. పూలమ్మ పెద్ద కోడలు. తను మామ తరపు దూరం సంబంధం. అందుకనే తన చిన్న కోడలును చూసినట్లు పెద్ద కోడలును చూడదు. చిన్న వంక దొరికినా రోజంతా అరుస్తానే ఉంటది.

ఆకలి పెరిగిపోతోంది పూలమ్మకు. కానీ ఇంకా బువ్వకూర ఉడకలేదు. తొందరగా ఐతే రెండు ముద్దలు తినొచ్చనే ఆశతో వంట పనిలో సాయం చేయబోయింది. " నువ్వేం ఈడ ఎలగబెట్టొద్దు కానీ పోయి బర్ల కాడ పేడకాళ్లు తీసి వాటికి కుడితి పెట్టుపో. " అన్నది అత్త.

పూలమ్మ లేచి గబగబ బర్ల కొట్టం కాడికి పోయి... కుడితి కలిపింది. బర్లను ఇడిసింది. అప్పటి దాకా దూప గొని నకనకలాడుతున్న బర్లు పగ్గం ఇప్పంగనే....గబగబ ఉరికి కడుపు నిండ కుడితి తాగినయి. తన ఆకలి మంట తీరకున్నా బర్ల ఆకలి తీరింది. పూలమ్మకు కూడా కడుపు నిండినట్లయ్యింది.

ఈ లోపే అత్త సద్ది మూట తెచ్చింది. " బతకమ్మ పండగ దగ్గర పడే. పండుగకు సుభద్ర తీస్కపోను ఆళ్ల తల్లిగారోళ్లు రేపో మాపో వస్తరు. ఇళ్లంతా అలకాలె. పూదియ్యాలే. మేమిద్దరం ఇయ్యాల ఆ పని చేస్తం. నువ్వు చెలక కాడికి సద్ది తీసుకుని పో. పత్తి చేల కలుపు తియ్యి. " అన్నది వెంకటమ్మ.

పూలమ్మ కండ్లల్ల నీళ్లు తిరిగినయి. " పెండ్లికి పోయినట్లు వయ్యారంగా నడుచుకుంట పైటేలకు పోయేవు. గబ గబ పో... " అంటూ పూలమ్మ నెత్తిన సద్ది మూట పెట్టింది. ఒక చేతితో నెత్తిన సద్ది మూట పట్టుకోని... ఇంకో చేతితో బర్లను కొట్టుకుంటూ చేను బాట పట్టింది పూలమ్మ.

దారి పొడుగునా ఎటు చూసినా గుంపుగా తంగేడు పొదలు. ఎక్కడో దేవలోకం నుంచి దిగి వచ్చిన బంగారు రెక్కల సీతాకోక చిలుకలు కొమ్మల మీద వాలినట్లున్నాయి విరగ పూసిన పచ్చని పూలు. ఆ పూలను చూస్తూ ఆకలి కూడా మరిచిపోయింది.

తంగేడు పూలంటే పూలమ్మకు చిన్నప్పట్నించీ చెప్పలేనంత ప్రేమ. పెళ్లికి ముందు తల్లిగారింటి దగ్గర ఉండగ.... బతకమ్మ పండగ మొదలయ్యిందంటే చాలు. పూలమ్మ కాళ్లు రెక్కలు నేలమీద నిలిచేయి కాదు. తెల్లారక ముందే నిద్రలేచి పిట్టలాగా పూలకోసం ఉరికేది.

తంగేడు పూలు, గునుగు పూలు, గడ్డి పూలు, బీర పూలు....ఇట్ల తీరొక్క పూలు తెంపుకుని బువ్వలు తినే యాలకు ఇల్లు చేరుకునేది. తెచ్చిన పూలన్నీ ఒక చాపలో పోసేది. వాళ్లమ్మతో కలిసి పెద్ద బతకమ్మను పేర్చేది. "ఎదురింటోళ్లు, ఎవలకన్నా పూలు దొరకనోళ్లు... పూలమ్మ రెండు పూలియ్యరాదే.. " అని ఎంత అడుక్కున్నా ఇచ్చేది కాదు. నా బతకమ్మే అందరికన్నా పెద్దగా ఉండాలే....అనుకునేది.

పొద్దూకే ఏళకు తలస్నానం చేసి... ఉన్న పాతబట్టలే ఏసుకుని అందంగా తయారయ్యేది. తనకంటే ఎత్తున్న బతకమ్మను తలమీద పెట్టుకుని పూలమ్మ నడుస్తుంటే అచ్చం బతకమ్మే జనం మధ్యలో కదులుతున్నట్లు ఉండేది.

***

చేను దగ్గరకు వచ్చే సరికి ....సద్దుల కోసం ఎదురు చూస్తున్నారు భర్త శంకరి, మరిది శీనయ్య.

" ఇగో సద్ది తెచ్చిన...." అంటూ భర్తకు ఇనపడేలా కేక పెట్టింది పూలమ్మ. "ఓ శీనయ్యా. సద్ది తెచ్చినా" అంటూ మరిదిని పిలిచింది.

చేను మధ్యలో ఉన్న ఆరె చెట్టు కొమ్మకు సద్ది మూట తగిలించింది. నీళ్ల మోటరు కాడికి పోయి కుండతోని నీళ్లు పట్టుకోని సద్దుల కాడికి వచ్చింది. భర్త శంకరి, మరిది శీనయ్య కూడా ఆరె చెట్టు కిందకి వచ్చిన్రు.

"ఒక్కదానివే వచ్చినవు. మాయమ్మ, సుభద్ర రాలేదు....?" అని అడిగిండు శంకరి.

పూలమ్మ ఏమీ మాట్లాడలేదు. మరిది శీనయ్యకు మాత్రం అర్థమయ్యింది. " అన్నా. ఎల్లుండి బతకమ్మ పండగ కదనే. సుభద్రను పుట్టింటికి తీస్కపోను ఆళ్ల నాయన ఇయ్యాల వస్తడు. అందుకనే సుభద్ర ఇంటికాడ ఉన్నట్టుంది." అన్నడు .

పూలమ్మకు తిండి తినబుద్ది కాలే.... గబగబ లేచి పోయి పత్తి చేల కూలబడ్డది. పూలమ్మ ఇంటికాడనే తిని వచ్చిందేమో అనుకున్నడు శంకరి. పత్తి చేల కలుపు తీస్కుంట వలవలా ఏడ్చింది పూలమ్మ.

ఇప్పుడు పూలమ్మకు ఇరవై ఐదు ఏళ్లుంటయేమో. పదకొండేళ్లకే శంకరితోని పెళ్లి అయింది. అత్తకు పూలమ్మంటే చిన్న చూపు. ఏదో గతిలేక చేసుకున్నం అని నిత్యం సాదింపులు. పేరుకే ఇంట్ల కోడలు. పని మనిషికంటే అధ్వానంగా పని చేయించేది అత్త వెంకటమ్మ.

చిన్న వయసులో పెళ్లి, సరైన తిండిలేక, నిద్ర లేక.... ఇప్పటికీ సంతానం దక్కలేదు. పాతికేళ్లకే పుట్టెడు కష్టాలు చూసింది పూలమ్మ. ఈ కష్టాల చెర నుంచి విముక్తి దొరికేది బతకమ్మ పండగ జరిగే తొమ్మిది రోజులే. చేల గట్ల మీద తంగేడు పూలు కనపడ గానే నాయన వస్తడు... తీస్కపోతడని ఎదురు చూసేది పూలమ్మ.

ఇంగ పుట్టింటికి పోతుంటే పూలమ్మ ఆనందం మాటల్లో చెప్పతరం కాదు. వేరే లోకానికి పోతున్నంత ఆనందంగా ఉండేది.

పుట్టి పెరిగిన ఇల్లు, ఊరు... "బాగున్నవారా పూలమ్మ. ఎప్పుడొచ్చినవు...ఏంది బిడ్డా మనిషి తగ్గిపోయినవు.." అంటూ కడపునిండా ప్రేమతో పలుకరించే జనాలు. అట్ల తల్లిగారిల్లు వచ్చినపుడు పూలమ్మకు మళ్లొక్క జన్మ ఎత్తినంత సంబరం.

బిడ్డ రాక రాక వచ్చిందని తల్లి కాలు నేలమీద పెట్టనిచ్చేది కాదు. ఉన్నంతలోనే కమ్మగా అన్నీ చేసి పెట్టేది. ఇంగ బతకమ్మ మొదలు పెట్టిన సద్దుల బతకమ్మ రోజు నుంచీ మల్లా చిన్నపిల్లే అయ్యేది పూలమ్మ.

అట్లాంటి పూలమ్మకు ఈ ఏడాది పుట్టింటికి పోయే రాతకు దూరమయ్యింది.

***

తమ్ముడు శీనయ్య చెప్పిన మాటతో పూలమ్మ ఎందుకు బాధపడుతుందో అర్థమైంది శంకరికి.

" ఏటా బతకమ్మ పండక్కు పూలమ్మను తీసుకపోవడానికి వచ్చే మామ సోమయ్య ఈ ఏడాది రాడు." అనే సంగతి గుర్తొచ్చింది. చెయ్యేత్తు మనిషి పూలమ్మ తండ్రి . బండెడు కష్టం చేసేటోడు. ఓ నాడు పని చేస్తూ చేస్తూనే కుప్పకూలిండు. కంగారు పడి దావాఖానా పట్టుకుని పోతే కిడ్నీలు ఫెయిలైనయని చెప్పిన్రు డాక్టర్లు. నెల తిరక్కుండానే పాణం పోయింది. భర్త పోయినంక ఒంటరిదై....గుండె చెదిరింది పూలమ్మ తల్లికి. ఏడ్చీ, ఏడ్చీ ఆరు నెల్లు నిండక ముందే ఆమె కూడా ఊపిరిడిసింది. అట్ల పూలమ్మకు పుట్టి నిల్లే లేకుండా పోయింది. తల్లిదండ్రి పోయిన కాన్నించి పూలమ్మ ఏడ్వని గడియ లేదు.

ఏ దేవుడు ఎన్ని వరాలిచ్చినా పుట్టినిల్లు లేని బాధను తీరుస్తయా...

***

పొద్దూకాల బర్లను తోలుకుని వచ్చింది పూలమ్మ. బర్లను కొట్టంల కట్టేసి మేత ఏసి... ఇంటి లోపలకి వచ్చింది. వాకిట్ల మంచం వేసుకుని కూచున్నడు యారాలు సుభద్ర తండ్రి . బతకమ్మ పండక్కు బిడ్డను తీసుకపోవడానికి వచ్చిండు. ఆ సంతోషంతో... తల్లిగారింటికి పోయేందుకోసం అన్నీ సర్దుకుంటోంది సుభద్ర.

పూలమ్మ రాగానే అత్త "నల్లా కాడ నీళ్లు వస్తున్నయి. నాల్గు బిందెలు మోయి. " అని చెప్పింది.

బిందె తీసుకుని బజార్లో నీళ్ల నల్లా దగ్గరకు వచ్చింది పూలమ్మ.

"నీలక్కా. మీ వోళ్లు వచ్చినరంటగా. పుట్టింటికి తీస్కపోనీకి... " " అవునక్కా నేను రేపు పోతన్న... "

" మా నాయిన రేపు వస్తడట.... "

సగం చీకటి...సగం వెలుతురులో నీళ్ల పంపు దగ్గర అమ్మలక్కల మాటలు. సగం ఇన్పడీ సగం ఇన్పడటం లేదు పూలమ్మకు. తనలో తాను బాధపడుతూనే నీళ్లు మోసింది.

అందరు అన్నాలు తినడానికి కూచున్నారు. పూలమ్మ దూరంగా అరుగు మీద కూచొని ఉంది. అన్నాలు తినే దగ్గర సుభద్ర తండ్రి సైదులు మాట్లాడుతున్న మాటలు చెవిన పడ్డాయి.

" అల్లుడా శంకరి. పండుగకు బుజ్జిని మా ఇంటికి తీస్కపోత. " అంటూ శంకరిని అడిగిండు.

“ తీస్క పోరాదే మామ. నీ బిడ్డను నువ్వు తీస్కపో.  మీ అల్లుడు శీనయ్యనడుగు. నన్నెందుకు అడిగేది. తీస్కపో… “ అన్నడు .

“ అది కాదు అయ్యా. నేనడిగేది. చిన్న బుజ్జి గురించి కాదు. పెద్ద బిడ్డ పూలమ్మ గురించి… నాకు సుభద్రే కాదు. పూలమ్మ కూడా బిడ్డ సోంటిదే కద నాయన. తల్లిదండ్రిని తీస్కపోయి ఆ భగమంతుడు పూలమ్మకు అన్యాయం చేసిండు. కానీ మేమున్నం కదా. అంద్కనే ఇద్దరినీ పండ్కగి తీసుకపోత“ అన్నడు సైదులు.

ఇంతలనే అత్త వెంకటమ్మ అక్కడికి వచ్చింది.  “ బాగుంది సంబరం. ఇద్దరినీ తీస్కోని పోతే ఇంటెడు చాకిరీ ఎవడు చెయాలె..” సప్పుడు చెయ్యకుండ నీ బిడ్డ సుభద్రను తీస్కోని పొద్దున్నే పో. లేని పోని కైలాటం పెట్టకు“… అని కటువుగానే చెప్పింది వెంకటమ్మ.

 “అది కాదక్కా…. “ అంటూ సైదులు ఏదో సర్ది సెప్పబోతున్నా పట్టించుకోకుండా లేచి పోయింది వెంకటమ్మ.

అందరు అన్నాలు తిన్నంక తాను కూడా ఇంత తిని ….ఆ అంట్లన్నీ తోమీ వంటగదిలో సర్దిపెట్టింది పూలమ్మ. అందరికీ మంచాలు వేసి పక్కలు పరిచింది.

“సుభద్ర వాళ్లింటికి అంట పోతవా… “ అడుగుతున్నడు అన్నడు శంకరి మంచంలో పడుకుంటూ.

ఏమీ మాట్లాడలేదు పూలమ్మ.

 బాద్రపద మాసంలో చిక్కటి  మబ్బులు కమ్మిన ఆకాశం. గబ్బగయ్యి లాంటి చీకటి తప్ప కంటికి ఏమీ కనపడతలేదు. అట్లనే చీకటిలోకి చూస్తూ ఆలోచించింది పూలమ్మ. “ ఇంట్లె పని అంత ఎవలు చేస్తరు… ” అని అత్త అన్న మాటలు గుర్తుకొచ్చినయి.

“ అయినా పొద్దున్నే బర్లకు గడ్డి తేవాలె. చెలక్కాడ సద్దులు ఇయ్యాలే, పత్తి చేల కలుపు…. ఇయ్యన్నీ నేను లేకుంటే ఎట్లయితయి. ? నేనేం పోనులే. “  అన్నది పూలమ్మ.

***

కోడి కూత సప్పుడు కాగానే మెలకువొచ్చింది పూలమ్మకు. లేచి చూస్తే శంకరి మంచంల లేడు. లేచి గబ గబ ఇల్లంతా ఊకింది. పేడనీళ్లు కలిపి సాన్పి చల్లింది. రోజు లాగానే కొడవలి తీసుకుని గడ్డి కోయడానికి బయలు దేరింది పూలమ్మ. ఇంతలో దొడ్లె బర్ల పాలు పిండుకుని వచ్చాడు పూలమ్మ భర్త శంకరి.

“ పూలమ్మ ఇయాళ గడ్డి నువ్వు కోయకుంటే మాయె. పొద్దుగూకాల నేను కోసుకొని వస్త గానీ. నువ్వు సుభద్రతోని మామోళ్ల ఇంటికి బతకమ్మ పండక్కి పోయిరా... “ అన్నడు.

ఆ మాటలినంగనే అత్త వెంకటమ్మ గయ్యిన లేచింది. “ వామ్మో పెండ్లం మీద బాగానే పేమ కురుత్తుందేమిరో. ఒక్క గడ్డి కోస్క రాంగానే సరిపోయిందారా. మిగిలిన పనంత ఎవలు జేత్తర్రా. నా వొక్కదాని తోని అయితదారా....“ మొత్తుకుంటోంది వెంకటమ్మ.

అంతలోనే చిన్న కొడుకు శీనయ్య అందుకున్నడు. “ అది కాదమ్మా. బతకమ్మ పండగంటే ఆడబిడ్డల పండగ. ఏడాది కొక్కసారి వచ్చే పండగ. ఏడాదంతా ఎద్దులాగా బండెడు చాకిరి చేత్తనే ఉంది కద వదిన. ఈ పదిరోజులు వదిలి పెట్టరాదే. అవసరమైతే వదిన సేసే పనంత నేను చేత్త. వదినని పోయిరాని... “ గట్టిగ చెప్పిండు శీనయ్య.

“ ఇంట్ల అందరూ ఒక్కటైతే నాదేం పోయింది... “ అనుకుంటు పొయ్యిల నిప్పు రాజేసింది వెంకటమ్మ.

“పూలమ్మా.... పోయి బట్టలు సర్దుకోరా... “ అన్నడు సుభద్ర తండ్రి. ఇంట్లెకు పోయిన బట్టలు సర్దుకుంటుంటే వచ్చిండు భర్త శంకరి.

“ ఇంగో ఈ డబ్బులు తీసుకో. నువ్వు, సుభద్ర కొత్త చీరెలు కొనుక్కోరి... “ అంటూ చేతిల డబ్బులు పెట్టిండు. పూలమ్మకు నోట్లె మాట రాలేదు. ఒక్కసారిగా భర్తను కావలించుకుని గుండెలకు అదుముకుంది పూలమ్మ. పసి పిల్లలాగా వలవల ఏడ్చింది. ఎన్నాళ్ల దుఃఖమో అది.

“ ఏహే ఊకో. అన్నిటికీ చిన్నపిల్లలాగా ఏడుస్తరా...“ అంటూ పూలమ్మ కన్నీళ్లు తుడిచాడు శంకరి.

సుభద్రతో పాటే పుట్టింటికి బయలు దేరింది పూలమ్మ.

***

ఆటో వేగంగా పోతోంది. దారి పొడుగునా పచ్చగా పూసిన తంగేడు పూలు. గుత్తులు గుత్తులుగా గునుగు పూలు. పిల్లగాలికి అలలు అలలుగా కదులుతున్న కంది చేలు. పుట్టింటికి పోయి రా బిడ్డా... అంటూ పూలమ్మకు సెలవు పలుకుతున్నాయి.